క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన సీఐలు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామం దమ్మపేట మండలం గండుగులపల్లిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు టి.కరుణాకర్, మోహన్ బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్కను అందించారు.

జీళ్లచెరువు ఆలయాభివృద్ధికి రూ.2 లక్షల విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి వ్యాపారవేత్తలు రామా శ్రీను, నాగండ్ల వెంకటేశ్వరరావు, బైరిశెట్టి రమేష్ కలిసి రూ.2లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ చైర్మన్ అంబాల వెంకటలక్ష్మికి అందించగా.. ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.

రెండు ఆటోలు ఢీ..

- ఒకరికి తీవ్ర గాయాలు

కూసుమంచి: కూసుమంచి శివాలయం సమీపాన శుక్రవారం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాకు చెందిన బానోత్ రవికి తీవ్ర గాయాలు కాగా 108లో ఖమ్మంకు తరలించారు.

భర్తను బ్లేడ్‌తో కోసిన భార్య

నేలకొండపల్లి: కుటుంబ తగాదాలతో ఓ భార్య తన భర్తను బ్లేడ్‌తో కోసి గాయపరిచింది. మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో క్షతగాత్రుడికి నేలకొండపల్లిలో చికిత్స అందించాక ఖమ్మం తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నేలకొండపల్లి: ఈ నెల 20న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్యకు శుక్రవారం సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు అనేక పోరాటలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి కేవలం నాలుగు చట్టాలను మాత్రమే అమలు చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, రాసాల నవీన్, వాసంశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్, రెట్రో, జింఖానా
సాయిరాం	జగదేకవీరుడు అతిలోక సుందరి, తండర్‌బోల్ట్స్
ఆదిత్య	శుభం, జింఖానా, అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
శ్రీనివాస	దేశముదురు, తుడారమ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	26		20
కాకర	30	చుక్కకూర	3
బీట్‌రూట్	30		20
బీర	60	తోటకూర	4
దొండ	30		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్లు..

- బేస్‌మెంట్‌తో నిలిచిన పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


నేలకొండపల్లిలో బేస్‌మెంట్‌తో నిలిచిన నమూనా ఇంటి నిర్మాణం

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మండల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ధోరణి అవలంభిస్తుంది. వీరి పని తీరు పట్ల పథకమే చిన్నబుచ్చుకుంటుంది. ఆదర్శంగా ఉండాల్సిన మండల కేంద్రంలోని నమూనా ఇళ్ల నిర్మాణ పనులు పడకేశాయి. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరూ నిలిచిన నమూనా ఇంటి పనులు చూసి అవాక్కవుతున్నారు.

పడకేసిన పనులు

పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల కేంద్రంలో చేపట్టిన నమూనా ఇంటి పనులను పక్కన పడేశారు. నమూనా ఇంటిలో పడక గది, హాల్, వంటగది, బాత్‌రూం, మరుగుదొడ్డి ఉండేలా నిర్మించ తలపెట్టిన నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినా... అధికార యంత్రాంగం మాత్రం పనుల పట్ల మెతక వైఖరి అవలంభిస్తున్నారు.

అవగాహన ఎలా..?

నెలలు తరబడి బేసిమెంట్ వరకు నిర్మించి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. ఈ నమూనా ఇంటి నిర్మాణం పట్ల ఇటు అధికారులు.. అటు కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయితే గ్రామాల్లో లబ్ధిదారులను తీసుకొచ్చి అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇంటి నిర్మాణ పనులను శర వేగంగా పూర్తి చేసి ఆదర్శంగా నింపాల్సి అవసరం ఎంతైనా ఉంది.

ఎం.వీ.పాలెంను మండల కేంద్రంగా ప్రకటించాలి


మండల కేంద్రంపై వివరిస్తున్న అఖిలపక్షం నాయకులు

ఖమ్మం రూరల్/నేలకొండపల్లి: ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వీ.పాలెంను మండల కేంద్రంగా ప్రకటించాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూర్ దయాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఖమ్మం రూరల్ పేరుతోనే మండలం కొనసాగిస్తూ, కార్యాలయ భవనాలు ఎం.వీ.పాలెంలో నిర్మించేలా సహకరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. నాయకులు సత్యం, వెంకట్రామయ్య, వెంకన్న, తుమ్మల సురేష్, యాదగిరి, రమణ, మంగయ్య, జగన్, సుధాకర్, కందుల స్వామి, నాగేశ్వరరావు, రాము, రవి, రాజయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి కూతురు శివరంజని వివాహం సందర్భంగా కోనాయిగూడెంలో వారి నివాసంలో తుంబూరు దయాకర్‌రెడ్డి ఆశీర్వదించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాల పెంపునకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరామయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: మైనారిటీ విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడిన మైనారిటీ గురుకులాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అడ్మిషన్లు పెంచేలా చూడాలని ఖమ్మం జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్స్ రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ కె.వెంకటరామయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని ముస్తఫానగర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద మైనారిటీ వర్గాలను విద్యకి చేరువలోకి తీసుకురావాలని, మైనారిటీ గురుకులాలు రాష్ట్రవ్యాప్తంగా సాధిస్తున్న ఫలితాలను వివరిస్తూ మత పెద్దల సహకారాన్ని కోరారు. అనంతరం కొణిజర్ల మండలం తనికెళ్ల వద్ద ఉన్న మైనారిటీ గురుకుల ఖమ్మం బాయ్స్ కళాశాల ప్రిన్సిపాల్ జితేష్ షాహిల్ మాట్లాడుతూ.. మైనారిటీ అడ్మిషన్లు పెంచే ఉద్యమంలో ముస్లిం మత పెద్దలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాఠశాల, కళాశాల డిప్యూటీ వార్డెన్ ఎండీ యాకూబ్‌పాషా, మధిర పాఠశాల డిప్యూటీ వార్డెన్ ఎండీ అస్గర్ బేగ్, కృష్ణయ్య, ఎండీ అప్సర్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: పత్రికా స్వేచ్ఛను హరించడం తగదని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి నివాసంలో చొరబడి సోదాలు చేయడం పత్రిక స్వేచ్ఛను హరించడమే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపుతూ ప్రజల పక్షాన నిలబడుతున్న జర్నలిస్టులపై దాడులు చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. పత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగితే జర్నలిస్ట్ యూనియన్లు అన్నీ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు చేసే పోరాటానికి ఏఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ దాడిని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్, మనోజ్, గోపి, పవన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు దారుణం..

నేలకొండపల్లి: పత్రికా స్వేచ్ఛపై దాడులు చేయడం దారుణమని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శి పోలంపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనుంజయ్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో జర్నలిస్టులు ఎస్.నరసింహారావు, గంజికుంట్ల వెంకన్న, గొలుసు ఆంజనేయులు, మల్లేల ఉపేందర్, పెంటమళ్ల కోటయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తేజావత్ గిరి, మల్లెబోయిన ఉపేందర్, రాంబాబు, అరుణ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న ట్రైయినీ ఎస్సై దివ్య

కూసుమంచి: రహదారులపై సురక్షిత ప్రయాణం జరగాలంటే అందరి బాధ్యత అవసరమని ట్రైయినీ ఎస్సై దివ్య అన్నారు. ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి, అదానీ కంపెనీ ఆధ్వర్యాన శుక్రవారం నాయకన్‌గూడెంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు రహదారులపై ధాన్యం ఆరబోసినా, రహదారులపైకి పశువులను వదిలినా వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని , ఇకనైనా అలా చేయకుండా చూడాలన్నారు. మాజీ సర్పంచ్ కాసాని సైదులు, జాతీయ రహదారి ప్రాజెక్టు మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, రూట్ మేనేజర్ కొండలరావు, సిబ్బంది కార్తీక్, సతీష్ యాదవ్, వేణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న పండితులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ప్రాచీన దివ్యక్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం(గుట్ట)లో శుక్రవారం నుంచి వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 5:30 గంటలకు మంగళ వాయిద్యాలతో ఉత్సవాలను పండితులు సంప్రదాయ పద్ధతిలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో పండితులు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గాంధీచౌక్‌లో మజ్జిగ పంపిణీ ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న వ్యాపారులు

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రత దృష్ట్యా నగరంలోని గాంధీచౌక్ హనుమాన్ విగ్రహం వద్ద వరప్రదాత సాయి మందిరం చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం నుంచి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ బుడిగం రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. వ్యాపారులు, దాతల సహకారంతో రోజూ ఉదయం 11 గంటల నుంచి మజ్జిగ పంపిణీ ఉంటుందని నిర్వాహకులు వేములపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి బాటసారుల ఉపశమనం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో ప్రసాద్, జగన్, నిరంజన్, సూరినారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం/కూసుమంచి: రఘునాథపాలెం మండలం మంచుకొండ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సతీష్ తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని మంచుకొండ, బూడిదంపాడు, సూర్యతండా, వాంకుడోత్‌తండా, పుటానితండా, హర్యాతండా, బద్యాతండా సుకినీతండా తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే కూసుమంచి మండలం నర్సింహులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గైగోళ్లపల్లి, ఉతడలగూడెంలతో పాటు జీళ్లచెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని జీళ్లచెరువు, నేలపట్ల, గోపాలరావుపేట, మునిగేపల్లి, అగ్రహారం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

నేటితో ముగియనున్న రుద్రాక్షల ప్రదర్శన


మాలను విక్రయిస్తున్న నిర్వాహకుడు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్షల ప్రదర్శన శనివారంతో ముగియనుంది. కరుంగళి మాలలు పుట్టిన తేదీని బట్టి ఏక ముఖి రుద్రాక్ష నుంచి 21 ముఖముల రుద్రాక్షలు తమ వద్ద లభిస్తాయని ఓం శ్రీ నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. నేపాల్ నుంచి రుద్రాక్షలు తీసుకొచ్చి వివిధ పట్టణాలలో 4,5 రోజుల పాటు ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. నేడు శనిత్రయోదశి సందర్భంగా రుద్రాక్షల ధారణ చేసిన మరిన్ని సత్ఫలితాలు కలుగుతాయన్నారు.

నివాళి..

కూసుమంచి: కూసుమంచి గ్రామానికి చెందిన జర్నలిస్టులు భోనగిరి రాజేంద్రప్రసాద్, లక్ష్మీనర్సింహారావుల మాతృమూర్తి వెంకటవీరమ్మ (85) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా.. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ధాన్యం రైతుల నిలువు దోపిడీ


క్వింటాకు నాలుగున్నర కిలోలు తీసిన తక్‌పట్టి

తిరుమలాయపాలెం: ఆరుగాలం కష్టించి పనిచేస్తున్న రైతన్నలు దోపిడీకి గురవుతున్నారు. ధాన్యం రైతులను నిట్టనిలువునా దోపిడీకి గురిచేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పిండిప్రోలు పరిధిలో ఏర్పాటు చేసిన ఎదుళ్ల చెరువు ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మిల్లర్లకు తరలించిన ధాన్యం క్వింటాకు నాలుగున్నర కిలోల తారం తియ్యడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై శుక్రవారం సొసైటీ అధికారులను రైతులు నిలదీశారు.

సమాచారం లేకుండానే తరలింపు..

గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు చెందిన 878 బస్తాలు(351 క్వింటాళ్లు) హన్మకొండలోని ఓ మిల్లుకి తరలించగా.. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా 840 బస్తాలు చూపించి 336 క్వింటాళ్లు వచ్చినట్లు తక్‌పట్టి పంపించారు. అయితే ఇప్పటికే కేంద్రంలో తూర్పారా, కాంటా, ట్రాన్స్‌పోర్ట్ తదితర ఖర్చుల కింద రూ.103 పెట్టుకున్నామని, బస్తాకు ఒకటిన్నర కేజీలను అదనంగా కాంటా వేస్తున్నారని అయినా మిల్లర్లు క్వింటాకు నాలుగున్నర కేజీలు తీయ్యడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై సొసైటీ అధికారులను ప్రశ్నిస్తే ధాన్యం ఎలా దిగుమతి అవుతుందోనని బెదిరిస్తున్నారని గుర్రం అనిల్ అనే రైతు వాపోయాడు. ఈమేరకు పాలేరు స్పెషల్ ఆఫీసర్ రమేష్, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అపరిమితంగా తరుగు తీస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై సొసైటీ సీఈఓ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తారం తీస్తున్నారని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.

మిర్చి మద్దతు ధర మోసపూరిత చర్య


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రైతులు పండించే మిర్చి పంటకు కేంద్ర ప్రభుత్వం రూ.10,374లు మద్దతు ధర ప్రకటించడం మోసపూరిత చర్య అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని మంచికంటి హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన రైతులను మరింత నష్టపరిచేలా ఉందన్నారు. ఖమ్మం కేంద్రంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ హార్తల్‌లో అని కార్మిక, రైతు సంఘాలతో కలిసి ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సంఘాల నేతలు కల్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు | పారదర్శకంగా చేపట్టాలి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: రాబోయే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ లేదా మండలాన్ని యూనిట్‌గా తీసుకొని సర్దుబాటు చేయాలని, సర్దుబాటు పేరుతో జిల్లా కేంద్రం దగ్గరలోని పాఠశాలలకు ఉపాధ్యాయులను తీసుకురావడం సమంజసం కాదన్నారు. ఈ నెల 13 నుంచి నిర్వహించే శిక్షణ తరగతులకు రిటైర్మెంట్ దగ్గరలో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలని, పదో తరగతి మూల్యాంకన పైకం, 'మధ్యాహ్న'బకాయిలు చెల్లించాలని కోరుతూ 23 రన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కార్యదర్శులు పినపాక సురేష్, షేక్.నాగూర్ వలీ తదితరులున్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: గత వారం ఉగ్రవాదులు నిర్వహించిన దాడికి నిరసనగా, భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ఖమ్మం నగర పాలక సంస్థలోని ఉద్యోగులు శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు తీసుకునే చర్యలకు దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలవాలని, భారత ఆర్మీ చేపట్టిన చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని వారు తెలియజేశారు.

ఆలయంలో పూజలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉగ్రవాదులను తుదిముట్టించిన భారత సైన్యానికి మద్దతుగా నగరంలోని 41వ డివిజన్ సీనియర్ కార్పొరేటర్ కర్నాటి క్రిష్ణ శుక్రవారం చెరువుబజార్‌లోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

వారికి అదే అడ్డా..

మందుబాబులకు కేరాఫ్ పాత డీఆర్‌డీఏ కార్యాలయం

- ప్రశ్నించిన వారితో వాగ్వాదం
- కరువైన పోలీసుల గస్తీ
- పట్టించుకోని అధికారులు


పాత డీఆర్‌డీఏలో ఉన్న కార్యాలయాల బోర్డులు

ఖమ్మం రాపర్తినగర్: పాత డీఆర్‌డీఏ కార్యాలయం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. నిత్యం మందుబాబులతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఆ ప్రాంత వాసులు ఒకట్రెండు సార్లు బెదిరించిన ఇది నీ స్థలామా? నీ ఇల్లా? అని వాగ్వాదానికి దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆ ప్రాంతవాసులు మనకెందుకులే అన్నట్లుగా వదిలేస్తున్నారు. ప్రస్తుతం అందులో ఓ ప్రధాన బ్యాంకు కూడా ఉంది. కనీసం వాచ్‌మెన్‌ను నియమించుకోలేని దుస్థితి నెలకొంది.


మందుబాబులు కూర్చునే స్థలం

పోలీసుల గస్తీ పెంచితేనే..

డీఆర్‌డీఏ కార్యాలయంతో పాటు ఎదురుగా ఉన్న వైన్స్ షాపులలో మద్యం తీసుకొచ్చి ఇక్కడ సేవిస్తుండగా మరికొంతమంది గంజాయిని సేవిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా జరగకుండా పోలీసులు గస్తీ పెంచితేనే నివారించవచ్చని అంటున్నారు. పోలీసులు ఎంత సేపటికీ మద్యం సేవించిన వారిని పట్టుకుందామా అనే ఆలోచన తప్ప ఎక్కడ ఏం జరుగుతుందోనేది వాకబు చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు దృష్టి పెట్టాలని తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చీకటి పడితే చాలు..

కార్యాలయం వెనుక విశాలమైన ఖాళీ స్థలం ఉండడంతో రాత్రయితే చాలు మందుబాబులు అక్కడ గంజాయితో పాటు సిట్టింగులు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం అందులో ప్రధానంగా బాల సంరక్షణ, ఆర్అండ్‌బీ కార్యాలయాలు, బ్యాంకులు ఉన్నాయి. కాగా, మధ్యాహ్న సమయాల్లో ఆటోడ్రైవర్లు కొద్దిసేపు సేదదీరేందుకు అక్కడి వచ్చి భోజనం చేసి వెళ్తుంటారు. పిల్లలు సైతం కొద్దిసేపు క్రికెట్ ఆడుకుంటారు. రాత్రి వచ్చే వారు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహిస్తున్నారని ఆప్రాంతవాసులు పేర్కొంటున్నారు.